క్లుప్తంగా

నేటితో ముగియనున్న ఆలయ వార్షికోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: మండలంలోని సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతి ధామం ఆలయ వార్షికోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ చెప్పారు. 10.30 గంటలకు మహా కుంభాభిషేకం, అనంతరం హారతి, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పరస ఉంటుందని, సాయంత్రం సంధ్యాహారతి, పుష్పయాగం, ఊంజల్ సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి దూరం


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ మానస

పెదగంట్యాడ: ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పిస్తే క్షయను నివారించవచ్చని సిద్ధేశ్వరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి మానస అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 74వ వార్డు పరిధి పెదకోరాడలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ అంటే భయపడవద్దని రెండు వారాలకు మించి దగ్గుతో బాధ పడుతున్న వారు వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భూలక్ష్మి, దేవి, ఆశ, రమ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెదమడక పైడిమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవ గోడపత్రికను ఆలయ, ఉత్సవ కమిటీలు ఆవిష్కరించాయి. ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విందుల నారాయణరావు, మోటూరు వెంకట రమణ, విందుల సతీష్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించనున్నామన్నారు. పదో తేదీన పుట్ట బంగారు మహోత్సవం, 15వ తేదీన పేరంటాళ్ల అగ్ని గుండ ప్రవేశం, 18న భక్తిగీతాలాపన, పౌరాణిక నాటకాలు, లేడీస్ తీన్‌మార్, అఘోరా, బుర్రకథ, బండ్ల వేషాలు, డ్యాన్స్ హంగామాతోపాటు రేలా రేలా రేలారే కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మజ్జి శ్రీను, గంతకోరు అప్పారావు, అపరపిని వరహాలరావు, కరణం సన్ని, కాయల నరసింగరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: నిర్వాహణ పనుల నేపథ్యంలో బుధవారం వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామని జోన్-6 అధికారులు తెలిపారు. సిద్దార్థనగర్‌లోని 12 ఎంఎల్‌డీ మంచినీటి శుద్ధి కర్మాగారం వాల్వులు మార్చుతున్నందున 86, 87వ వార్డుల్లోని కాలనీలకు మంచి నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు.

16 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కూర్మన్నపాలెం: వడ్లపూడిలోని సీతారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 16 నుంచి ఘనంగా నిర్వహించనున్నట్టు 87 వార్డు కార్పొరేటర్ బొండా జగన్ తెలిపారు. మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. వార్షికోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

భారీ వాహనాల హల్‌చల్

వడ్లపూడి మెయిన్ రోడ్డులో విచ్చలవిడిగా రాకపోకలు

జనం బెంబేలెత్తుతున్నా పట్టించుకోని అధికారులు

పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు




వడ్లపూడి ప్రధాన రహదారిలో భారీ లారీలు



జనావాసాల మధ్యలో భారీ వాహనాలు హల్‌చల్ చేస్తున్నాయి. నిబంధనలను పట్టించుకోవడం లేదు. వాటిని నిరోధించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులందుతున్నా తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గాజువాక : జాతీయ రహదారికి ఆనుకొని వడ్లపూడి ప్రాంతం ఉన్న విషయం తెలిసిందే. దానికి పక్కనే గాజువాక ఆటోనగర్ కూడా ఉంది. ఆటోనగర్‌కు రోజూ వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వాటికోసం శ్రీనగర్ జంక్షన్ నుంచి ఒక రహదారి, ఆటోనగర్ జంక్షన్ నుంచి మరో రహదారి ఉన్నాయి. వడ్లపూడి నుంచి కూడా ఆటోనగర్‌కు రోడ్డు అనుసంధానమై ఉంది. జాతీయ రహదారిలో వస్తున్న భారీ వాహనాలు శ్రీనగర్ వరకు వెళ్లకుండా వడ్లపూడి నుంచి ఆటోనగర్‌లోకి రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిని అడ్డుకోవాల్సిన ట్రాఫిక్ సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దరిమిలా భారీ వాహనాలు అడ్డూఅదుపూ లేకుండా ఇళ్ల మధ్యలోనుంచి ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తూ..

వడ్లపూడి జంక్షన్‌కు ఆనుకొని జనావాసాలు ఉండటంతో ఆ రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగించకూడదు. అయితే, ఆటోనగర్ జంక్షన్ నుంచి ఇ.బ్లాక్‌కు రావాలంటే ఒక్కోసారి తుంగ్లాం రైల్వే గేటువద్ద అంతరాయం ఏర్పడుతుంది. శ్రీనగర్ జంక్షన్‌నుంచి వెళ్లాలన్నా, ఆటోనగర్ జంక్షన్ నుంచి వెళ్లాలన్నా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. వడ్లపూడి జంక్షన్‌నుంచి వెళ్లిపోతే లారీ డ్రైవర్లు తమ గమ్యస్థానానికి ఐదు నిమిషాల్లో చేరిపోతారు. దీంతో నిబంధనలను అతిక్రమించి మరీ లారీ డ్రైవర్లు జనావాసాలమధ్యనుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా

అనుమతి లేకపోయినప్పటికీ రాకపోకలు సాగిస్తున్నాయి. అంతేకాకుండా భారీ వాహనాల రాకపోకలు కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దువ్వాడ స్టేషన్ రోడ్‌లో ఫేజ్-6వద్ద చోటు చేసుకున్న లారీ ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సుమారు ఐదేరాళ్ల క్రితం జరిగిన ఈ సంఘటన తరువాత ఆ రోడ్‌లో చాలాకాలం భారీ వాహనాలను అనుమతించలేదు. పాఠశాలకు విద్యార్థులు వెళ్తున్న సమయంలో ఫార్మా బస్సు ఢీకొన్న సంఘటనలో ఉక్కునగరంలో ఒక విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఆ రోడ్‌లో ఫార్మా బస్సుల రాకపోకలను నిషేధించారు. ఇలా ఏదైనా సంఘటన జరిగితే తప్ప అధికారులు పట్టించుకోరా అని జనం ప్రశ్నిస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం

లారీలు, టారస్‌లు, ట్రాలర్లు రాకపోకలకు సంబంధించి సమయం, సందర్భం ఉండటంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. భారీ వాహనాలనే అనుమతించడానికి వీల్లేని ఈ రోడ్‌లో ట్రాఫిక్ సిబ్బంది వాటిని అనుమతించడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి ఒకపక్క స్కూల్ బస్సులు, ఆటోలు, మరోపక్క ఫార్మా బస్సులు, ద్విచక్ర వాహనాలతో వడ్లపూడి ప్రధాన రహదారులు కిక్కిరిసిపోతాయి. ఆ సమయంలో కూడా భారీ వాహనాలు విచ్చలవిడిగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిపై స్థానికులు ఎవరైనా నిల

వాహన రాకపోకలు నిరోధించాలి

వడ్లపూడి నుంచి ఆటోనగర్‌కు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను నిరోధించాలంటూ అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. అయితే, కొంతమంది ట్రాఫిక్ సిబ్బంది మాత్రం భారీ వాహనాల రాకపోకలను సమర్థిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అందువల్ల కణితి గాంధీబొమ్మ జంక్షన్‌వద్ద గడ్డర్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దీస్తే తెలియక వచ్చేశామని, ఇకపై రాబోమంటూ డ్రైవర్లు తప్పించుకొంటున్నారు. అయితే, జంక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది మాత్రం వారిని కనీసం నిలువరించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యువత పోరుకు తరలిరండి

గాజువాక : విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ, చంద్రబాబు సర్కారుపై తలపెట్టిన నిరసన గళం 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాత గాజువాక జంక్షన్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు నివాళులర్పించి జెండాను ఆవిష్కరిస్తామని తెలిపారు. అక్కడ్నుంచి జిల్లా పరిషత్ వద్దగల కృష్ణ మందిరం చేరుకొని పాదయాత్రగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా పైడితల్లమ్మ నెల పండగ


పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెం గ్రామ దేవత పైడితల్లమ్మ నెల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అలాగే వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బట్టు పైడిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బట్టు అప్పలరెడ్డి, వెంకటరెడ్డి, తాతారావు, చిన్నారావు, సావాడ అప్పలరెడ్డి, సింహాచలం, పిట్ట సంజీవరెడ్డి పాల్గొన్నారు.

20న ఆశీలు వసూలుకు వేలం

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని రోజువారీ సంతలు, వారపు సంతలు, రోడ్ మార్జిన్‌లలో ఆశీలు వసూలుకు ఈనెల 20న వేలంపాట నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జోనల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తిగలవారు పూర్తి వివరాల కోసం జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు

ప్రమాద సమయంలో సమయస్ఫూర్తి అవసరం


అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కాంతంకు బహుమతిని అందజేస్తున్న సీజీఎం ఎల్ఎస్‌రావు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదాలు, ఇంట్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తితో ఎదుర్కొని వాటిని నివారించాలని గెయిల్ ఇండియా లిమిటెడ్ సీజీఎం (ఓఅండ్ఎం) ఎల్.ఎస్. రావు అన్నారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పలు ప్రమాదాలు జరిగినప్పుడు వ్యవహరించాల్సిన సమయస్ఫూర్తి, వాటిని ఎలా నివారించాలో వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల నుంచి హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతంకు గెయిల్ ఇండియా లిమిటెడ్ నుంచి బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డీజీఎం (ఫైర్ అండ్ సేఫ్టీ) మౌళినాథ్ భట్టాచార్య, వీవో (సీనియర్ మేనేజర్ ఫైర్ అండ్ సేఫ్టీ) సునీల్ కుమార్, సిబ్బంది సయ్యద్ హుస్సేన్, ఉపాధ్యాయులు కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కేవీ, వీవీవీలో అడ్మిషన్లు చేపట్టాలి


స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ), విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)లో 2025-26 సంవత్సరానికి గానూ అడ్మిషన్లు ప్రారంభించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి. గాంధీకి వినతి పత్రం అందజేశారు. పై రెండు పాఠశాలలు నిర్వహణకు అవసరమైన నిధులను విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే సమకూరుస్తోందన్నారు. గత ఏడాది ఒకటో తరగతి, కేవీలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు నిలిపి వేశారన్నారు. దానిపై తీవ్ర ఆందోళన చేయడంతో వెనక్కు తగ్గారన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలలు ఒకటో తరగతి అడ్మిషన్లు ప్రారంభించగా కేవీ, వీవీవీలో ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. దీంతో నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. అదే విధంగా ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం నిరాకరిస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్‌లు అడ్మిషన్ల ప్రారంభించేలా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చిరంజీవి పాల్గొన్నారు.

28న గాజువాక బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న గాజువాక బార్ అసోసియేషన్ నాయకులు

గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకరరావు, టి.పుల్లయ్య నాయుడు తదితరులు ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈనెల 17న నామినేషన్ పత్రాల దాఖలు, 19న ఉపసంహరణ, 28న ఎన్నికల నిర్వహణ ఉంటాయని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం ఓట్లను లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది వాడాడ శ్రీనివాసరావును ఎన్నికల అధికారిగా, పి.పార్వతీశాన్ని సహాయకుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత కార్యవర్గం గడిచిన ఏడాది కాలంగా సంతృప్తకరంగా సేవలను అందించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.కిషన్‌బాబు, ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థికి రూ.50 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం


హర్షను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి : దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థి బలస హర్ష రూ.50 లక్షల వార్షిక ప్యాకేజీతో అమెజాన్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ అధ్యాపకుల కృషి, విద్యార్థి పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హర్ష ఈ ఘనత సాధించాడని, తమకు గర్వంగా ఉందన్నారు. హర్షను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ డీన్ దినేష్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ బొడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న జడ్జి షణ్ముఖరావు

పెదగంట్యాడ: విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదేనని గాజువాక 13వ జిల్లా అదనపు జడ్జ్ జి.షణ్ముఖరావు అన్నారు. ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా, తాకరాని చోట తాకినా అటువంటి వారిపై పోక్సో కేసు నమోదు చేస్తే శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో తెలిపారు. ఇటీవల కాలంలో బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్యరామ్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీసు రద్దు చేయాలి


స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును ఉపసంహరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. షోకాజ్ నోటీసు ఉపసంహరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిలుపుదల తదితర డిమాండ్ల పై పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్లు ప్యాకేజి ప్రకటించి ఆ సొమ్మును బ్యాంకులకు చెల్లించడం జరిగిందన్నారు.

ఉత్పత్తి పెంచేందుకు, జీతాలు చెల్లించేందుకు వినియోగించలేదన్నారు. ఒకవైపు ప్యాకేజి ప్రకటించి మరోవైపు వీఆర్ఎస్ పేరిట 1,130 మంది ఉద్యోగులను తగ్గించడం, కాంట్రాక్ట్ కార్మికులు వేలాది మంది తొలగింపు వంటి చర్యలకు పాల్పడటం అన్యాయమన్నారు. అంతే కాకుండా సుమారు 6 వేల మంది కార్మికులకు హెచ్ఆర్ఏ నిలిపివేయడంతో పాటు ఉక్కునగరంలో నివశిస్తున్న కార్మికుల విద్యుత్ చార్జీలు యూనిట్ రూ.8లకు పెంచడం జరిగిందన్నారు. యాజమాన్యం తమ నిరంకుశ వైఖరి మార్చుకుని షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిలిపివేయడంతో పాటు ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమావేశాల్లో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, రమణమూర్తి, యు. రామస్వామి, జె. రామకృష్ణ, సుబ్బయ్య, మహాలక్ష్మినాయుడు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, మునగపాక అచ్చింనాయుడు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేమువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి ఘటాలను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానిక మహిళలు పూర్ణకుంభాలతో, పసుపు కుంకుమలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఘటాలను ఎత్తుకున్న వారి పాదాలకు జలాభిషేకం చేశారు. చీరలు చూపించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై చర్యలు


మాట్లాడుతున్న హార్బర్ ఏసీపీ కాళిదాసు

పెదగంట్యాడ: ప్రజా పంపిణీ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొంతమంది దళారులు అక్రమంగా రవాణా చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హార్బర్ ఏసీపీ కాళిదాస్ హెచ్చరించారు. స్థానిక న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశానుసారం నెల రోజులుగా బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై నిఘా ఉంచామని తెలిపారు. ఇందులో భాగంగా అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.2,09,912 విలువ చేసే 5,524 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే బియ్యాన్ని తరలిస్తున్న గెంబలి ప్రసాద్, పెద్దిన కొండలరావు, అంకాల నారాయణపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే బియ్యాన్ని రవాణా చేస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన యుద్ధ కళ థాంగ్ టా


క్రీడాకారులతో ప్రిన్సిపాల్ వసంతదేవి

పరవాడ: థాంగ్-టా కళను అభ్యసించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు విద్యార్థులు ముందుకు రావాలని బాల భారతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వసంతదేవి పిలుపునిచ్చారు. దీపాంజలినగర్‌లోని స్కూల్లో 15వ ప్రపంచ థాంగ్-టా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ థాంగ్-టా భారతీయ పురాతన యుద్ధ కళ అన్నారు. పీఈటీ షెల్టన్‌జేమ్స్ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా, యూత్‌గేమ్స్‌లో ఈ క్రీడ గుర్తింపు పొందిందన్నారు.